క్లుప్తంగా

కాంగ్రెస్ ఓబీసీసెల్ అధ్యక్షుడిగా సత్యన్న

మరికల్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీసెల్ మండల అధ్యక్షుడిగా సత్యన్న ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా చైర్మన్ కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యన్న మాట్లాడుతూ అందరి సహకారంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరన్న, హరీష్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు



మద్దూరు: కొత్తపల్లి మండలం గొర్లోనిబాయి గ్రామంలో ఏర్పాటు చేసిన సబ్ రేషన్ దుకాణాన్ని సోమవారం సర్పంచ్ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో గ్రామస్తులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిషన్‌నగర్‌కు వెళ్లి సరకులు తెచ్చుకునేవారని తెలిపారు. గ్రామంలో సబ్ రేషన్ దుకాణం ఏర్పాటుతో లబ్ధిదారులకు దూరభారం తగ్గిందన్నారు.

పథకాల అమలులో విఫలం

ధన్వాడ: సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసినా గృహలక్ష్మి, బీసీబంధు, దళితబంధు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టి అమాయక ప్రజలను మోసం చేశారన్నారు. స్వార్థ రాజకీయం కోసం ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు.

చేపపిల్లలు విడుదల



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి చెరువులో సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను సరఫరా చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివకుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంక్‌డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యం



అమరచింత: అమరచింతను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ అఖిల పక్ష పార్టీలతో కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అమరచింతకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వానికి వివరించనున్నట్లు రెవెన్యూ డివిజన్ సాధన సమితి పేర్కొంది. సోమవారం పట్టణంలోని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నాయకులు అఖిల పక్షంగా ఏర్పడి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 11న పట్టణంలోని పద్మశాలి భవన్‌లో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జీఎస్ గోపి, నరాల నారాయణ, భాస్కర్, తౌఫిక్, పోసిరిగారి విష్ణు, ప్రభుదాస్, బాలస్వామి, కుతుబ్, రాజన్న, బుచ్చన్న ఉన్నారు.

హైదరాబాద్ తరలిన దివ్యాంగులు

అమరచింత: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు మండలంలోని దివ్యాంగులు తరలి వెళ్లారు. దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రామాంజనేయులు, ప్రభుదాస్, కళానందం, నాగరాజ్, గోపాల్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



మల్లేపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లేపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం సీసీరోడ్లు, ఊట్కూర్–మక్తల్ బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లేపల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.10లక్షలు, నాగిరెడ్డిపల్లికి రూ.30లక్షలు, ఊట్కూర్ నుంచి మక్తల్ రైల్వే బ్రిడ్జి వరకు బీటీరోడ్డు పనులకు రూ.9కోట్ల 32లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ప్రతి ఎకరాకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి దేశంలో ఎక్కడాలేని పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

యువకుడికి సన్మానం

మండలంలోని తిమ్మారెడ్డిపల్లితండాకు చెందిన దినేష్‌నాయక్ పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని ఎమ్మెల్యే చిట్టెం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పెద్దపొర్ల, చిన్నపొర్ల, ఊట్కూరు, తిమ్మారెడ్డిపల్లితండా తదితర గ్రామాలకు చెందిన సుమారు 15మంది పోలీసు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాఘవరెడ్డి, హన్మంతు, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, లక్ష్మారెడ్డి, సురేష్, కతలప్ప పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

కోస్గి: పట్టణంలో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో సోమవారం పలు కాలనీల మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. పట్టణంలోని 4, 11 వార్డుల్లోని మహిళలు బహార్‌పేట చెక్‌పోస్టు వద్ద పాలమూరు–తాండూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శశిధర్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నించారు. తాగునీటి సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని కాలనీవాసులు స్పష్టం చేశారు. కాలనీలో అప్పటికప్పుడు విద్యుత్ బోరుమోటారు ఏర్పాటు చేయించడంతో ధర్నాను విరమించారు. కాగా రోడ్డు విస్తరణ పనులతో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. కాలనీలో ఉన్న సింగిల్‌ఫేజ్ బోరు మోటారును మరమ్మతు నిమిత్తం తీసుకెళ్లి పట్టించుకోకపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. ఇప్పటికైనా మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు త్వరగా మరమ్మతు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



అంబేద్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్వ: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ జయరాములుశెట్టి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.30లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల ప్రజాప్రతినిధులు హడావిడిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వీణావతి, సర్పంచ్ పెద్దింటి సంధ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ లక్ష్మన్న, దండు అయ్యప్ప, వెంకటేశ్వర్‌రావు, శంకర్, కల్వాల్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి



మరికల్: మండల కేంద్రంలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని సోమవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మాట్లాడుతూ బహుజన యోధుడు కాన్షీరాం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, చంద్రయ్య, హన్మంతు, రాజు, అశోక్, మోహన్, వెంకటయ్య, తిరుమలేష్, అరవింద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధన్వాడ: మండల కేంద్రానికి చెందిన పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉదయభాను తల్లి తిరుపతమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా తిరుపతమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బాల్‌రాజు ఉన్నారు.

ఎస్సీ ఉపకులాలను విస్మరిస్తే సహించం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ ఉపకులాల నాయకులు

మరికల్: ప్రభుత్వ పథకాల అమలులో ఎస్సీ ఉపకులాలను విస్మరిస్తే సహించమని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నార కొండయ్య అన్నారు. దళితబంధు, గృహలక్ష్మి పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల్లో ఉన్న మాదాసి కురువ, మాదారి కురువ, బేడ బుడగజంగం, హోలియ దాసరి, మాల దాసరి, దొమ్మర, బైండ్ల, మోచీ కులాల వారిని పథకాలకు ఎందుకు ఎంపిక చేయడం లేదని ప్రశ్నించారు. మరికల్‌కు 40 దళితబంధు యూనిట్లు మంజూరైతే ఎస్సీ ఉపకులాల్లో ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదన్నారు. కేవలం తమను ఓటుబ్యాంకుగానే చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్, వెంకట్రాములు, శ్రీనివాసులు, ఆశప్ప, వెంకటయ్య, కుర్మన్న, రాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోస్గి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాజాత బృందం సూచించింది. గుండుమాల్ మండలం అమ్లికుంట్లలో సోమవారం సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, చోరీలు, సామాజిక అంశాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతికత ఎంత అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి బ్యాంకు ఖాతాలోని నగదును చోరీ చేస్తారని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దని సూచించారు. గ్రామాల్లో చోరీల నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే 1098 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రానికి బారులు



మాగనూర్‌లో ఆధార్ అప్‌డేట్ కోసం క్యూకట్టిన రేషన్ లబ్ధిదారులు

మాగనూర్: మండల కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రం రేషన్ లబ్ధిదారులతో కిటకిటలాడుతోంది. రేషన్ ఈకేవైసీకి లబ్ధిదారుల వేలిముద్రలు రాకపోవడంతో ఆధార్ అప్‌డేట్ కోసం బారులు దీరుతున్నారు. మక్తల్ లాంటి పట్టణాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో ఇక్కడికి భారీగా తరలివస్తున్నారు. ఆధార్ కేంద్రం నిర్వాహకులు టోకెన్ల వారీగా ఆధార్ అప్‌గ్రేడ్ చేస్తున్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం



నిరుపయోగకరంగా ఉన్న పాఠశాల పాత భవనం

మాగనూర్: మండలంలోని మందిపల్లి పాఠశాల పాత భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న భవనంలో మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఉన్న రెండు గదుల్లోనే 250 మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. గదుల కొరతతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పాఠశాల పాత భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సర్జఖాన్‌పేట విద్యార్థులు



కోస్గి: మండలంలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హరికృష్ణ, రమాదేవి, శివలీల రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8న నిర్వహించిన అండర్–17 ఉమ్మడి జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 12, 13, 14 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింహులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



యంనోనిపల్లిలో గొర్రెలు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ సురేఖ

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. మండలంలోని మందిపల్లి, యంనోనిపల్లి గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొల్ల కురుమలకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెల యూనిట్లను అందిస్తుందని తెలిపారు. మందిపల్లిలో 25, యంనోనిపల్లిలో 23 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ సుదీర్ కుమార్, మల్లప్ప, బుర్రప్ప, శ్రీరాములు, కేశవులు, రాజవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సచిన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



లంకాల్‌లో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్వ: మండలంలోని లంకాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డిని కోరగా, స్వంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వివిధ కాలనీల్లో ఐదు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమారాంరెడ్డి, ఎంపీటీసీ చంద్రకళ, ఉపసర్పంచ్ చంద్రకళ, సుధ, బీసం చెన్నయ్యసాగర్, విజయ్, రవికుమార్, జనార్దన్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులపై నిర్లక్ష్యం తగదు



మక్తల్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నారాయణపేట: మధ్యాహ్నభోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంబించడం తగదని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.వెంకట్రామారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద సోమవారం కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్నభోజన కార్మికులకు రూ.వెయ్యి వేతనం పెంచి ఇస్తామని ప్రభుత్వం చెప్పి ఏడాది గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ఐదారేళ్ల కింద నిర్ణయించిన మెనూ చార్జీలనే ఇప్పటికీ అమలు చేయడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొత్తగా అల్పాహారం, రాగిజావా ఇవ్వాలని నిర్ణయించి కార్మికులతో అదనంగా శ్రమదోపిడీ చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గోపాల్, హన్మంతు, అంజయ్యగౌడ్, అశోక్, వెంకటయ్య, రవి పాల్గొన్నారు.

మక్తల్: మధ్యాహ్నభోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులపై చిన్నచూపు చూడటం తగదన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, పద్మమ్మ, భుట్టో, లక్ష్మి, బాబామ్మ, లలిత, ప్రవీణ్, వెంకటమ్మ, అనిత, వెంకటమ్మ, జ్యోతి, రాజమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ల పోస్టులు భర్తీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

నారాయణపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ప్రగతిశీలా మహిళా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పార్కు వరకు ర్యాలీ అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రుల్లో మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు వస్తే ఒక్కో బెడ్‌లో ఇద్దరి చొప్పున ఉండే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వైద్యంపై నిర్లక్ష్యం వీడాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారి నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శారద, సౌజన్య, భాగ్యలక్ష్మి, సునీత, సరళ, మంజుల, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజానాయకుడిని గెలిపించుకుందాం



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దామరగిద్ద: నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ప్రజానాయకుడు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మూడోసారి గెలిపించుకుందామని బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బస్వరాజ్, జ్ఞానేశ్వర్, పుట్టి అంజి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని సజనాపూర్, ఉడ్మల్‌గిద్ద గ్రామాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, దశరథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకట్ నర్సింహ, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివాజీ మహారాజ్ రథయాత్ర



ఛత్రపతి శివాజీ రథయాత్రలో పాల్గొన్న యువకులు

మక్తల్: ఛత్రపతి శివాజీ స్ఫూర్తి శ్రీశైల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం శివాజీ మహారాజ్ రథయాత్ర చేపట్టారు. పట్టణంలోని నల్లజానమ్మ ఆలయం నుంచి శ్రీరాం లీలా మైదానం వరకు యాత్ర వైభవంగా సాగింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకమై 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రథయాత్ర నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.